క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ప్రతాప్‌కుమార్‌రెడ్డితో మొయిళ్ల గౌరి

కావలి (జలదంకి): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, ఆమె భర్త సురేష్‌రెడ్డిలు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించారు.

పరామర్శ

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి వెంకటనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చెన్నైలో చికిత్స పొంది కావలిలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

ఆశీర్వచనం

కావలి రెండో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సుబ్బారెడ్డి మనుమరాలి బారసాల కార్యక్రమానికి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించారు.

వధూవరులకు విక్రమ్‌రెడ్డి ఆశీర్వాదం



ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవీడులో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు నందా ఓబులేసు ఇంట జరిగిన వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. వధూవరులు చింతా చినకామక్షయ్య, అంజనీదేవి దంపతులను ఆశీర్వదించి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నేతలు కొల్లి దొరస్వామినాయుడు, నిజమాల నరసింహులు, కొప్పోలు వెంకటేశ్వర్లు, పాలేటి వెంగళరెడ్డి, సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, దాడి శ్రీనివాసులునాయుడు, తోడేటి అశోక్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ



రమణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలం చిరమన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోడా భాస్కర్‌రెడ్డి తండ్రి రమణారెడ్డి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబసభ్యులకు ధైర్యంగా ఉండాలని చెప్పారు. పార్టీ నాయకులు సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, కంటాబత్తిన రఘునాథరెడ్డి, ఎ.కోటిరెడ్డి, ఐతా వెంకటేశ్వర్లు, సూరా శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

జి.చెరువుపల్లిలో 104 సేవలు



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

ఉదయగిరి రూరల్: మండలంలోని జి.చెరువుపల్లిలో మండల వైద్యాధికారిణి వినీత 104 వాహనం ద్వారా వైద్య పరీక్షలను గురువారం నిర్వహించారు. సుమారు 70 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవి దృష్ట్యా వడదెబ్బ సోకకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీర్ఘకాలిక రోగులు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రాజేశ్వరి, ఏఎన్‌ఎం గిరిజా, సిబ్బంది పాల్గొన్నారు.

సోమశిలలో మెడికల్ క్యాంప్



సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని సోమశిలలో డాక్టర్ మూర్తి క్లినిక్ వద్ద బీఎస్సార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను గురువారం నిర్వహించారు. వైద్య నిపుణురాలు డాక్టర్ సిరాజ్ ఖానం దాదాపు 80 మంది పిల్లలకు వైద్యం చేసి కావల్సిన మందులను ఉచితంగా అందజేశారు.

బస్టాండ్‌కు వెళ్లే దారేదీ?

- నలువైపులా ఆక్రమణలే..
- పట్టించుకోని మున్సిపల్, పోలీస్ అధికారులు
- దెబ్బతింటున్న దాత ఆశయం



బస్టాండ్‌లోకి వెళ్లే మార్గంలో నిలిపిన ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లు

ఆత్మకూరు: ప్రయాణికుల సౌకర్యార్థం దాత సాయంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన బస్టాండ్ ఆక్రమణలతో కూరుకుపోతోంది. బస్టాండ్ చుట్టూ తోపుడు బండ్లు ఇతర వ్యాపారులు ఆక్రమణలు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా బస్టాండ్ భవనం లోపలికి వెళ్లే దారినే ద్విచక్ర వాహనదారులు, తోపుడు బండ్ల వ్యాపారులు ఆక్రమించేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో ప్రయాణికులు తమ లగేజీలతో లోపలికి వెళ్లే క్రమంలో వ్యాపారస్తులతో చిన్నపాటి గొడవలు చోటు చేసుకుంటున్నాయి.

రూ.4.50 కోట్లతో..

రెండేళ్ల క్రితం అప్పటి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కలిసి దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరుతో ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్‌ను సుమారు రూ.4.50 కోట్ల వ్యయంతో నిర్మించారు. నియోజకవర్గ కేంద్రంలో పట్టణ నడిబొడ్డున ఈ భవనం ఆత్మకూరుకు 'ఐకాన్'ల వెలసిందని పలువురు కొనియాడారు. దాత పరమేశ్వరరెడ్డి తాగునీటి వసతి కల్పించడంతో ప్రయాణికులకు అది కొంత ఉపయోగకరంగా ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో మున్సిపల్ బస్టాండ్‌లో వసతుల గురించి, సంబంధిత అధికారులు, ఆర్టీసీ అధికారులు పట్టించుకోలేదు. నలువైపులా తోపుడు బండ్లు నిలిపివేయడం, ఇతర వాహనాలు పార్కింగ్ చేయడంతో ముఖ్యంగా బస్సులు మలుపు తిప్పుకునేందుకు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు, పాయింట్‌లో బస్సు నిలిపేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్ నలువైపులా వెలసిన దుకాణాలు



ఆక్రమణలతో బస్సు మలుపు తిరిగేందుకు కష్టపడుతున్న వైనం



మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

పైలాన్ ప్రాజెక్ట్‌పై అవినీతిని నిరూపించాలి

- అక్రమ లేఅవుట్లు ఎక్కడో చూపించు
- వ్యక్తిగత కక్షతోనే కుటుంబాలను నాశనం చేస్తున్నావ్
- కావలి ఎమ్మెల్యేపై రామిరెడ్డి ఫైర్

కావలి (జలదంకి): అమృత్ పైలాన్ ప్రాజెక్టుపై విచారణ కమిటీ వేయించి అవినీతిని నిరూపించాలని, అక్రమ లేఅవుట్లు ఎక్కడో చూపించాలని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రస్తుత ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి సవాల్ విసిరారు. ఈ మేరకు ఆయన తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మూసేసిన పైలాన్ కేసును రీఓపెన్ చేయించి తనపై, అలాగే నాయకులు, మీడియా వ్యక్తులు కలిపి మొత్తం 12 మందిపై ఎలా అక్రమ కేసులు పెట్టించావో అందరికీ తెలుసన్నారు. ఒక నాయకుడిని అప్రూవర్‌గా మార్చుకుని నీవు చేసిన సినిమా అట్టర్‌ఫ్లాప్ అయిందన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల కాలంలో ప్రజలకు డీబీటీ ద్వారా రూ.1,120 కోట్ల లబ్ధి చేకూరిందని, అలాగే నాన్ డీబీటీ ద్వారా రూ.1,481 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. వీటిని వదిలేసి 153 ఎకరాల్లో అక్రమ లేఅవుట్లు వేశామని నిరాధర ఆరోపణలు తగవన్నారు. ఆయన చేసిన ఆరోపణలపై పబ్లిక్ స్థలంలో చర్చకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. నీవు గెలిచిన ఏడాదిలోనే ఎన్ని కుటుంబాలపై దాడులకు దిగావో, వారిని ఎలా కొట్టించావో ప్రజలకు తెలుసన్నారు. నటరాజ్ అనే యువకుడిపై దాడి, దాబా కృష్ణారెడ్డి ఎన్నికల సమయంలో ఏదో మాట్లాడాడని రాత్రి 11 గంటల సమయంలో దుర్మార్గంగా కొట్టించి దాబాను మూసివేయించడం, తుమ్మలపెంటలో రాజయ్య అనే వైస్ ఎంపీపీ పొలాన్ని లాగేసుకోవడం.. వంటి ఘటనలు ప్రజలు మరువరన్నారు. నలుగురు విలేకరులతో అబద్ధాలను పోస్టింగ్‌లు చేయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఉదయగిరి రోడ్డులో మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించి కొత్తవి నిర్మిస్తామని మోసం చేస్తున్నారని, దీనిపై త్వరలో పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ గెలిస్తే ప్రతి ఊర్లో రికార్డింగ్ డ్యాన్సులు అంటూ ఎమ్మెల్యే చెప్పారని, దానిని మాత్రం నిలబెట్టుకున్నారన్నారు. కలుగోళమ్మ దేవాలయం వద్ద అండర్ పాస్‌కు టెండర్లు పిలిచి ఏడాదిలోగా పూర్తి చేయిస్తానని మాట ఇవ్వగలవా అని ప్రశ్నించారు. మీరు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజు, బోగోలు మండలాధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, నాయకులు నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కనపర్తి రాజశేఖర్, కుందుర్తి కామయ్య, ఏగూరి చిన పుల్లయ్య, పేరం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ పావని పక్కన ఇరిగేషన్ ఈఈ, మున్సిపల్ కమిషనర్

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ పావని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆమె గురువారం సాయంత్రం అన్నిశాఖల ఉన్నతాధికారులు, సిబ్బందితో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో డ్రైయినేజీ వాటర్ సాగునీటి కాలువల్లో కలుస్తుండడం, శివారు ప్రాంతాల్లో మురుగు పేరుకుపోవడంపై కమిషనర్ గంగాప్రసాద్, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లతో చర్చించారు. గతంలో మున్సిపల్ పరిధిలోని పంపింగ్ స్కీము వేస్ట్ వాటర్ ప్రవహించే కాలువను పలు చోట్ల నిర్మాణం చేయకుండా వదిలేయడంతో ఆయా ప్రాంతాల్లో సమస్య అధికమైందని, దీనిపై ఫిర్యాదులు అందాయన్నారు. అదే క్రమంలో గిరిజన కాలనీల్లో లోఓల్టేజీ సమస్య గురించి విద్యుత్ ఏడీఈ సురేష్‌ను ప్రశ్నించారు. నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో సమస్యను అధిగమిస్తామని ఆయన తెలిపారు. ప్రజావసరాల కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించి రిజర్వులో ఉంచాలని ఇన్‌చార్జి తహసీల్దార్ స్వరూప్‌ను ఆదేశించారు. తిప్పపోరంబోకు ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు ఇవ్వడం గురించి వివరించారు. త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఇళ్ల పట్టాల కోసం అర్జీలు దాఖలు చేసిన వారికి స్థలాలు గుర్తించాలని హౌసింగ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దుస్థితిలోని సాగునీటి కాలువల్లో మురుగు తొలగించడంతో పాటు మరమ్మతులు చేయాల్సిన వాటిని గుర్తించి నివేదిక తయారు చేయాలన్నారు. అన్నిశాఖల అధికారులు వారి పరిధిలో చేయాల్సిన అభివృద్ధి, ఇప్పటి వరకు జరిగిన పనుల గురించి నివేదికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సుదర్శన్, రవితేజ, హౌసింగ్ ఏఈ జమీర్, విద్యుత్ శాఖ ఏఈలు, మున్సిపల్ ఏఈలు, ఆర్డీఓ కార్యాలయ డీటీ రాజ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూములను సర్వే చేయండి

అనుమసముద్రంపేట: పందిపాడు గ్రామంలోని ఆక్రమిత భూములను వెంటనే సర్వే చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ పావని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఏఎస్‌పేట తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్‌డేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు రీసర్వే తర్వాత తమ భూములు ఇతర పేర్లకు మార్పులు చెందాయని, కొంత మంది ఆక్రమించుకున్నారని అర్జీలను దాఖలు చేశారు. అంతేకాక హసనాపురం ప్రధాన రహదారి వెంబడి అనేక మంది భూములు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుంటున్నట్లు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై తక్షణమే సర్వే చేసి నివేదికను అందజేయాలని తెలిపారు. ఏఎస్‌పేట మండల కేంద్రంలో పారిశుద్ధ్యం మరుగున పడిందని, పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీటీసీ ఖాదర్ బాషా, ప్రస్తుత ఎంపీటీసీ అఫ్జల్ ఫిర్యాదు చేశారు. వెంటనే ఆమె పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి తాగునీటి సమస్యను పరిష్కరించడమే కాక పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. కాగా ప్రత్యేక గ్రీవెన్స్‌కు 24 అర్జీలు వచ్చినట్లు డీటీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ సమావేశం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సుజన అధ్యక్షతన సాధారణ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వార్డు సభ్యులు విద్యుత్ స్తంభాలు, డ్రెయినేజీ సమస్యల గురించి ప్రస్తావించారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేద నే అంశాన్ని లేవనెత్తారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈఓ గోపిశ్రీనివాస్ హామీ ఇచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు: దుత్తలూరులోని ఏపీ మోడల్ పాఠశాలలో ఆరో తరగతితో పాటు 7, 8, 9, ఇంటర్ మొదటి ఏడాదిలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జె.సైమన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బక్రీద్ పండగపై సమావేశం

సోమశిల: అనంతసాగరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బక్రీద్ పండగపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ నాగలక్ష్మి మాట్లాడుతూ గోవధ చేయరాదని, నిబంధనలు పాటించాలని సూచించారు. ఎంపీడీఓ రామచంద్రయ్య, ఆర్ఐ సిరాజ్ ఉన్నారు.

- మర్రిపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బక్రీద్ పండగపై మండల సమన్వయ కమిటీ సమక్షంలో తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్ని గ్రామాల ముస్లిం మత పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎస్సై శ్రీనివాసరావు ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్ల గ్రామంలో ఉన్న మానసాదేవి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ చైర్మన్ తిరుపతయ్య తెలిపారు. ఆయన గురువారం ఆలయంలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు భారీగా తరలిరావాలని కోరారు.

టీడీపీ నేతపై ఫిర్యాదు

చేజర్ల(ఆత్మకూరు): ఆదూరుపల్లికి చెందిన టీడీపీ నాయకుడు చీర్ల వెంకటేశ్వర్లు విలేకరులను తీవ్రంగా దూషించాడని పలువురు జర్నలిస్టులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తుండగా వార్త సేకరణకు వెళ్లిన టీవీ విలేకరి సుల్తాన్‌పై సదరు నాయకుడు పరుష పదజాలంతో దుషించాడు. ఈ మేరకు విలేకరులు ఎస్సై తిరుమలరావుకు ఫిర్యాదు చేశారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

వరికుంటపాడు: ముందు వెళ్తున్న టీవీఎస్ ఎక్సెల్ బైక్‌ను వెనుక నుంచి మరో మోటార్ బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన కృష్ణంరాజుపల్లి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. కృష్ణంరాజుపల్లికి చెందిన వేంపల్లి వెంకటసుబ్బరాజు టీవీఎస్ ఎక్సెల్ బైక్‌పై పొలానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో తొడుగుపల్లికి చెందిన యువకులు ప్రకాశం జిల్లా పామూరు నుంచి కంప్యూటర్ క్లాసులు ముగించుకుని స్వగ్రామమైన వస్తుండగా కృష్ణంరాజుపల్లి సమీపంలోని మలుపు వద్ద టీవీఎస్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వెంకటసుబ్బరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో తొలుత పామూరు ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

- జలదంకి: మండలంలోని జమ్మలపాళెం రహదారిపై బుల్లెట్ బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన గురువారం రాత్రి జరిగింది. జమ్మలపాళేనికి చెందిన శెట్టిపల్లి మాలకొండయ్య స్థానిక మిక్స్‌డ్ కాలనీ నుంచి ఇంటికి నడిచి వస్తుండగా కావలి వైపు నుంచి వస్తున్న బుల్లెట్ బైక్ అయన్ను వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. స్థానికులు గుర్తించి బైక్‌ను స్వాధీనం చేసుకుని మాలకొండయ్యను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. బైక్ నడిపిన వ్యక్తి పరారీలో ఉన్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి నిరసన



నిరసన చేస్తున్న ఉద్యోగులు

ఉదయగిరి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూఏ ఉద్యోగులు మూడో రోజు గురువారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికులపై పని భారం తగ్గించాలని, కార్మికులపై డిపో అధికారుల పక్షపాత వైఖరి విడనాడాలని, సిక్ లీవ్‌లకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నాగరాజు, సుజాత, శంకర్, ఖాసింబీ, జ్యోతి, మాధవి, శ్రీను, కృష్ణయ్య, కోటేశ్వరరావు, సిద్ధయ్య, ఆర్ఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఉదయగిరి: ఉదయగిరి ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరరావు గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ ఆవరణలో అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. పలువురు అధికారులు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం సత్కరించారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



దుత్తలూరు: మొక్క నాటుతున్న అధికారులు



ఉదయగిరి: వ్యవసాయ కళాశాలలో..



ఆత్మకూరురూరల్: ఎంఎస్ఎంఈ పార్కులో..



ఆత్మకూరు ఎంవీఐ కార్యాలయ ఆవరణలో..

దుత్తలూరు: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని అటవీ శాఖ ఉదయగిరి ఫారెస్ట్ రేంజర్ బీఎస్ కుమార్‌రాజా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దుత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వోలు కె.మురళి, కేవీ ప్రసాద్, ఎఫ్ఎస్ఓ శ్రీరాములు, ఎఫ్‌బీఓలు ఓంప్రకాష్, ఖాజామహ్మద్, అఫ్జల్, భానుతేజ, చిన్నపరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- ఉదయగిరి: పర్యావరణ పరిక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి సూచించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన స్థానిక కళాశాలలో గురువారం మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలన్నారు. ప్లాస్టిక్ పాత్రల్లో ఆహార పదార్థాలను నిల్వ చేయడం, ప్యాకింగ్ చేయడం అనారోగ్యాలకు దారితీస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణహిత జీవనం సాగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి రమేష్, ప్రొఫెసర్లు సునీత, దుర్గాప్రసాద్, కిషన్, శోభ, అశోక్, సురేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.
- పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అమ్మ పేరుతో ప్రతిఒక్కరూ మొక్క నాటి కాపాడాలన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది, నాయకులు మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు.
- కావలి (జలదంకి): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరి శ్రీనివాసులు అన్నారు. ఆయన ఆర్టీసీ గ్యారేజీలో మెకానికల్ సిబ్బందితో కలిసి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని, ఈ మేరకు విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ ఖాజా మొహిద్దీన్, సూపర్‌వైజర్లు రత్నం, రవిప్రకాష్, జనార్దనరావు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే తుమ్మలపెంట రోడ్డులోని అంబేడ్కర్ పార్కులో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌లు మొక్కలు నాటారు.
- ఆత్మకూరురూరల్: పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరి బాధ్యతగా భావించి మొక్కలు నాటేందుకు ప్రాధాన్యమివ్వాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని నారంపేట ఎంఎస్ఎంఈ పార్కులో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల పెంపకానికి ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు పెంచలచౌదరి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.
- అల్లూరు: ప్రతిఒక్కరూ మొక్కలను పెంచాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక టైలర్స్ కాలనీ, దయాకర్‌రెడ్డి లేఅవుట్, రామకృష్ణ కాలేజీ, సమ్మర్ స్టోరేజీతో పాటు పలు కార్యాలయాల ఆవరణలో గురువారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.
- కలిగిరి: మొక్కలు పెంచడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని విశ్రాంత హెచ్ఎం నందనవనం ప్రభాకర్‌రావు తెలిపారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా కలిగిరిలో గురువారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ దీక్షితులు, స్థానికులు అంకిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శీనయ్య, వంశీ పాల్గొన్నారు.
- సంగం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సీఐ వేమారెడ్డి అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగం సర్కిల్ కార్యాలయంలో ఎస్సై రాజేష్, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా సంగం ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది మొక్కలు నాటారు.
- వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి పాల్గొని, మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీడీఓ కార్తీక్, సర్పంచ్ సుజన, మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, స్థానిక నేతలు నరసారెడ్డి, సుబ్బారెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- సోమశిల: అనంతసాగరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ రామచంద్రయ్య పాల్గొని, మొక్కలు నాటారు.
- ఆత్మకూరు: స్థానిక ఎంవీఐ కార్యాలయ ఆవరణలో పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఎంవీఐ రాములు పాల్గొని, మొక్కలు నాటారు. అలాగే అటవీ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సోమశిల రోడ్డు చెరువు వద్ద రహదారులు, భవనాల శాఖ గెస్ట్ హౌస్ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో రేంజర్ శేఖర్, డీఆర్వో పిచ్చిరెడ్డి మొక్కలు నాటారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కమిషనర్ గంగాప్రసాద్ మొక్కలు నాటారు.

పింఛన్, జీపీఎఫ్‌పై లోక్‌అదాలత్



మాట్లాడుతున్న శాంతిప్రియ

వింజమూరు(ఉదయగిరి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పింఛన్, జీపీఎఫ్ సమస్యలకు సంబంధించి మెగా లోక్‌అదాలత్‌ను గురువారం నిర్వహించారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ పాల్గొని, మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పింఛన్, జీపీఎఫ్ కేసులను సమీక్షించే నిమిత్తం లోక్‌అదాలత్ నిర్వహించినట్లు చెప్పారు. సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ టి.కిశోర్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ ఎస్.మోహన్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ గంగాద్రి, జిల్లా ట్రెజరర్ మోహన్‌రావు, పలువురు ఎస్టీఓలు, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

అదనపు డీఎంహెచ్‌ఓ తనిఖీ

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలంలోని చిత్తలూరు పీహెచ్‌సీని అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది టీబీ మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. వైద్యులు నవీన్‌కుమార్‌రెడ్డి, నరసింహారావు ఉన్నారు.

చెరువు ఆధునికీకరణ పనులు ప్రారంభం

చేజర్ల(ఆత్మకూరు): చేజర్లలోని పెద్ద చెరువును గ్రామకొలను అభివృద్ధి పథకంలో భాగంగా ఆధునికీకరణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనులకు రూ.1.20 కోట్లు మంజూరైనట్లు సోమశిల దక్షిణ కాలువ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. చెరువు ఆయకట్టు చైర్మన్ అరవ గోపిరెడ్డి పాల్గొన్నారు.